ఈ నెల 24న పాలిసెట్

మెదక్ అర్బన్, మే 18: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఈ నెల 24న నిర్వహించనున్నట్టు మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత శనివారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సమయం లోపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల్లో (పీహెచ్‌సీ-యూపీహెచ్‌సీ) మరిన్ని ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలతో పాటు పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలను నెలకొల్పి పలు రకాల వైద్య సేవలందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల ద్వారా మరో 12 రకాల వైద్య సేవలు అందించాలని నిర్ణయించింది. అతిత్వరలో ఆ సేవలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నది. ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి వస్తే బాధితులు సుదూరంలో ఉన్న పెద్దాస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల్లో 12 రకాల ఆరోగ్య సేవలు
- మాతా శిశు సంరక్షణకు 'అమ్మ కోసం' కార్యక్రమం
- వైద్యాధికారులకు కొనసాగుతున్న శిక్షణ
- రోగులకు తప్పనున్న వ్యయప్రయాసలు
- పెద్దాసుపత్రులపై తగ్గనున్న ఒత్తిడి



పేదల చెంతకు వైద్య సేవలు

సంగారెడ్డి అర్బన్, మే 18 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటి వరకు మాతా శిశు సంరక్షణ, టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటు వ్యాధుల నియంత్రణ, నాన్‌కమ్యూనికేబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ), సాధారణ వ్యాధులకు చికిత్స అందించారు. ఇప్పుడు వాటికి అదనంగా ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు), ఆప్తాల్మిక్ (కళ్లు), డెంటల్, మానసిక, పాలియేటివ్‌కేర్, ఎల్డర్లీ హెల్త్ కేర్ (65 ఏళ్లు నిండిన వృద్ధులకు), నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్యసేవలు, నవజాత శిశు ఆరోగ్య సేవలు తదితర 12 రకాల చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. పేదలకు చేరువలో మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో కొత్తగా తీసుకొచ్చే ఈ ప్రత్యేక వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్లకు సరైన అవగాహన లేకపోవడంతో జిల్లాస్థాయిలో వైద్యాధికారులకు శిక్షణ ఇస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు మూడు, నాలుగు ఆరోగ్య కేంద్రాలకు కలిపి పలు స్పెషాలిటీ డాక్టర్లతో పాటు సిబ్బందిని కూడా నియమించేలా చర్యలు తీసుకోనున్నారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా..

ప్రసవానికి ముందు మాతా శిశు సంరక్షణకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు మరో ముందడుగు వేసింది. ప్రసవం అనంతరం బాలింతలు, శిశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలకు చికిత్స, సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరికొత్త కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ శ్రీకారం చుట్టబోతున్నది. ప్రధానంగా బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా 'అమ్మ కోసం' కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నది. ఇప్పటికే మాతా శిశు ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య మహిళ, ఎంసీహెచ్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు అమలు చేస్తున్న సర్కారు.. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

ప్రసవానంతరం నిరంతర పర్యవేక్షణ

మహిళలు ప్రసవానంతరం వివిధ కారణాలతో అనారోగ్యాల బారినపడుతుంటారు. హైరిస్క్‌లో ఉన్న వారు కొందరు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటారు. వీటిని దృష్టిలో ఉంచుకొని వైద్య ఆరోగ్య శాఖ నిరంతర పర్యవేక్షణ కార్యక్రమానికి నాంది పలికింది. బాలింతలకు వచ్చే ఆరోగ్య సమస్యలను ఆదిలోనే గుర్తించి ప్రత్యేక చికిత్స అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. ప్రసవానంతరం రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ తదితర అనారోగ్య సమస్యలతో బాలింతలు బాధపడుతుంటారు. అలాంటి సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేస్తారు. ఇవేకాకుండా ప్రధానంగా ఇన్‌ఫెక్షన్లు, కాళ్ల వాపు, నొప్పులు, బ్లీడింగ్, మానసిక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రసవం అనంతరం ఏడాది పాటు.. సాధారణ ప్రసవమైతే ఆరు విజిట్లు, సిజేరియన్ ప్రసవమైతే 14 విజిట్లలో ఏఎన్ఎంలు బాలింతల ఇంటికెళ్లి ఆరోగ్యంపై ఆరా తీస్తారు. పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు అందిస్తారు. బాలింత అందిస్తున్న సేవలు, చికిత్స వివరాలను సంబంధిత 'అమ్మ కోసం' పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఇప్పటికే అమ్మకోసం యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో ఇన్‌స్టాల్ చేయించి లాగిన్, పాస్‌వర్డులు కూడా ఇచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం అమలుకానుంది. ఇప్పటికే జిల్లాలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాలన్నీ అమలులోకి వస్తే పేదల చెంతకే మెరుగైన వైద్య సేవలు వస్తాయి.



పెచ్చులూడిన పైకప్పును చూపుతున్న బాలమణి

పెచ్చులూడిన 'డబుల్‌బెడ్రూం'

- ఇద్దరికి తృటిలో తప్పిన ప్రమాదం



నేలపై పడిన పైకప్పు పెచ్చులు

తూప్రాన్, మే 18: డబుల్‌బెడ్రూం ఇళ్ల డొల్లతనం బయటపడింది. పంపిణీచేసి సంవత్సరమైనా కాక ముందే పైకప్పు పెచ్చులూడుతున్నాయి. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఓ ఘటనలో డబుల్‌బెడ్రూం ఇంట్లో ఉంటున్న నాయనమ్మ, మనవరాలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణంలో పేదలకు 436 డబుల్‌బెడ్రూం ఇళ్లను పంపిణీ చేశారు. నిర్మాణ సమయంలోనే నాణ్యతపై విమర్శలు వచ్చాయి. అయితే, తాజాగా 55వ బ్లాక్‌లో బాలమణికి చెందిన ఇంట్లో పైకప్పు పెచ్చులూడిపడింది. అదే గదిలో ఉన్న బాలమణి, ఆమె మనవరాలు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇళ్లు పెచ్చులూడడంతో కుటుంబ సభ్యులు భయంతో బయటకు వచ్చారు. నాలుగు కాలాలు ఉండాల్సిన ఇళ్లు ఏడాదికే పెచ్చులూడడంపై వారు ఆందోళన వ్యక్తంచేశారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

కల్హేర్, మే 18: ఇంటివద్ద ఆడుకుంటున్న చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చిన ఘటన కల్హేర్ మండల పరిధిలోని మార్డి గ్రామంలో శనివారం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అలిగె సాయిలు, అనితల కుమార్తె అన్విత(4), లైని సాయిలు, సత్యవ్వల కుమారుడు కార్తీక్ (8), మరో ఐదేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడిచేసింది. కుక్క దాడిలో కార్తీక్‌కు ముక్కు, అన్వితకు కుడి చెంప తెగిపోయాయి. మరో బాలికకు మొఖంపై తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. చిన్నారుల రోదనలకు అప్రమత్తమైన స్థానికులు కుక్కను తరిమేసి వారిని కాపాడారు. గాయాలపాలైన చిన్నారులను కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, చిన్నపిల్లలు గడపదాటాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోయారు.

టీజీగా మార్చుకోండి : కలెక్టర్

మెదక్ అర్బన్, మే 18: ప్రభుత్వరంగ సంస్థలు, ఏజెన్సీల పేర్లల్లో 'టీఎస్' స్థానంలో 'టీజీ'గా పేర్కొనాలని ప్రభుత్వశాఖల అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు జారీచేశారు. మార్చి నెలలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 'టీజీ'గా పేర్కొనాలని ఉత్తర్వులు వచ్చాయని, ప్రభుత్వం ఇతర ప్రభుత్వ వ్యవహారాల్లో 'టీఎస్'కు బదులు 'టీజీ'ని వినియోగించేందుకు తాజాగా ఆదేశాలు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తిగల సంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ ఇకపై వాటి పేర్లను టీజీతో ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని సూచించారు. లెటర్‌హెడ్‌లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, పాలసీపేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీజీగా మార్చుకోవాలని పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 25 లోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని కలెక్టర్ నిర్దేశించారు.

సంగారెడ్డి జిల్లాలో వర్షం

సంగారెడ్డి టౌన్, మే 18 : సంగారెడ్డి జిల్లాలో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నప్పటికీ మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. సంగారెడ్డి పట్టణంతో పాటు పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, జోగిపేట, సదాశివపేట, మునిపల్లి, రామచంద్రపురం, పుల్కల్, కంది, హత్నూర, నారాయణఖేడ్, వట్‌పల్లి, అమీన్‌పూర్, గుమ్మడిదల తదితర మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా రామచంద్రాపురంలో 42.3 మి.మీ., పటాన్‌చెరులో 33మి.మీ., కొండాపూర్‌లో 30 మి.మీ., అమీన్‌పూర్‌లో 14.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై వరద నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.

ఎప్‌సెట్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

మెదక్ అర్బన్, మే 18: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో మెదక్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బైపీసీ విభాగంలో మెదక్ పట్టణానికి చెందిన కావేటి సుమేష్‌సాయి(319 ర్యాంకు), ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు బైపీసీ విభాగంలో దుర్గాప్రసాద్ (31,977 ర్యాంకు), బాబు (62,490 ర్యాంకు), దినేష్‌గౌడ్(66,073 ర్యాంకు), ఇంజనీరింగ్ విభాగంలో.. సమీర్, ఏల్లేష్, సందీప్ అర్హత సాధించారు. మైనార్టీ బాలికల కళాశాలలో విద్యార్థినులు ఎంపీసీ విభాగంలో 73.33, బైపీసీ విభాగంలో 66.66 పర్సెంటేజ్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు.



శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

కొనుగోలు.. కష్టాలు..!

- ధాన్యం సేకరణలో జాప్యం
- అకాల వర్షానికి తడుస్తున్న వడ్లు
- పలుచోట్ల అన్నదాతల ఆందోళన

ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయిద్దామంటే అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతుండడంతో వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి. పంటంతా వర్షార్పణమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆందోళనలకు దిగుతున్నారు.

రోజుల తరబడి నిరీక్షణ

నర్సాపూర్, మే 18: నర్సాపూర్ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తూకం పూర్తయిన వడ్లను తరలించడానికి లారీలు రాకపోవడంతో రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. విసుగు చెందిన పలువురు రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఇక్కడ సేకరించిన ధాన్యాన్ని సిద్దిపేట జిల్లాలోని రైసుమిల్లుకు కేటాయించగా.. ధాన్యం నాణ్యత తక్కువగా ఉందని మిల్లువారు వడ్లు తీసుకువెళ్లడం లేదు. దీంతో రైతులు ఆందోళన చేయగా పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ వారిని శాంతింపజేశారు.

లారీకి 15 సంచుల తరుగు!

కౌడిపల్లి: తరుగు పేరిట రైతులను దోచుకుంటున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు శనివారం కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లడుతూ చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట్ సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు లారీకి 15 సంచుల తరుగు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని అడిగితే దురుసుగా సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లారీల కోసం రాస్తారోకో

కొల్చారం: తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించడానికి లారీలను పంపించాలని డిమాండ్ చేస్తూ కొల్చారం మండలం దుంపలకుంట చౌరస్తా వద్ద ఎనగండ్ల గ్రామ రైతులు శనివారం రాస్తారోకో చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం పూర్తిచేసిన వడ్లను మిల్లుకు తీసుకువెళ్లడానికి లారీలు రాకపోవడంతో వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసిముద్దవుతున్నాయని వాపోయారు. కల్లాల్లో ఉన్న వడ్లు మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, ఎస్సై మహ్మద్ గౌస్, ఆర్ఐ ప్రభాకర్ చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

గోనె సంచుల కొరత

శివ్వంపేట : మండల కేంద్రమైన శివ్వంపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో గోనెసంచుల కొరతతో ఐదు రోజులుగా ధాన్యం తూకం నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురియడంతో వడ్లు కొట్టుకపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసచారి, ఏవో లావణ్య కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు.



నర్సాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



కొల్చారం మండలం దుంపలకుంటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

అతనో ఉన్నతాధికారి వద్ద గన్‌మన్..కానీ, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. లక్షల్లో అప్పులు చేశాడు. దీంతో కుటుంబంలో గొడవలు.. అప్పులు తీరే మార్గం కనిపించక ఉన్మాదిలా మారాడు. ఇద్దరు పిల్లలు.. భార్యను తన సర్వీస్ రివ్వాలర్‌తో కాల్చి చంపి.. తనూ ఆత్మహత్య చేసుకున్నాడు.

అతను రైల్వే ఉద్యోగి.. మంచి జీతం, అంతకంటే మంచి ఉద్యోగం. కానీ, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. రూ. 2 కోట్లకు పైగా బెట్టింగ్‌ల్లో పోగొట్టుకున్నాడు. తండ్రి ఎంత మందలించినా వినలేదు. అప్పటికే కొన్ని ఆస్తులు విక్రయించగా.. మరికొన్ని ఆస్తులు విక్రయించేందుకు సిద్ధపడగా.. విసిగిపోయిన తండ్రి ఆ తనయుడిని దారుణంగా కొట్టి చంపాడు.

ఓ యువకుడు చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు దాచుకున్న డబ్బులు ఆన్‌లైన్ గేమ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. వారు అడిగితే ఏం చెప్పాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నాడు.



జీవితాలతో ఆటలు..!

- అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్
- బానిసలుగా మారుతున్న యువత
- చివరకు ఆత్మహత్యల వైపు..
- పల్లెలకూ పాకిన విషపు క్రీడ
- కన్నపేగుపై ప్రేమతో ఆస్తులు అమ్ముతున్న తల్లిదండ్రులు

సండే స్పెషల్

దుబ్బాక, మే 18 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లు.. గేమ్స్ బారిన పడి యువత అప్పుల బాధతో జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటూ ఇటు తల్లిదండ్రులను, అటు కుటుంబాలకు తీరని మనోవ్యథను మిగులుస్తున్నారు. తెలంగాణలో సుమారు 22 శాతం మంది యువత ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలవుతున్నట్లు ఇటీవల జరిగిన ఓ సర్వేలో తేలింది. ఇప్పుడు ఈవిషపు క్రీడ పల్లెలకూ పాకింది. గ్రామాల్లోని యువత కూడా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లు కాస్తూ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. అలాగే, ఉమ్మడి జిల్లా పరిధిలో నెలకు పదుల సంఖ్యలో ఆత్మహత్య కేసులు నమోదవుతున్నాయి. ఇందులో చాలావరకు అప్పుల బాధతో అని పోలీసుల రికార్డులకు ఎక్కుతున్నాయి కానీ ఈ ఆత్మహత్యల వెనుక ఆన్‌లైన్ అప్పులూ ఓ కారణంగా అనుమానిస్తున్నారు.

ఆశపెట్టి వలలోకి..

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లో బోనస్‌ల పేరిట.. వివిధ పథకాల పేరిట రూ.లక్షలు వస్తాయని ఆశపెట్టడంతో యువత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు ఆకర్షితులవుతున్నారు. మొదట తమ వద్ద ఉన్న డబ్బులు పెట్టి, ఆ తర్వాత తమ వాళ్ల, లేదా అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లలో పోగొట్టుకుంటున్నారు. ఎన్నిసార్లు ఆడినా డబ్బులు పోవడమే తప్ప రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చివరికి అవి తీరే మార్గం కనిపించక జీవితాలను అర్థంతరంగా ముగిస్తున్నారు.

గ్రామాల్లో పంచాయితీలు..

గ్రామాల్లో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా కూడా ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొదటిసారి ఆడినప్పుడు డబ్బులు రావడం.. వివిధ కారణాలతో యువత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు అలవాటు పడి ఎంత వడ్డీకి అయిన అప్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు 30 శాతం వడ్డీకి కూడా అప్పులు తీసుకుని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. అయితే, ఆ అప్పులు తీర్చలేక గ్రామ పెద్దల ఎదుట పంచాయతీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసి తల్లిదండ్రులు లబోదిబోమంటు అప్పులు ఇచ్చిన వారిని పిలిచి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. కన్నపేగు మీద ప్రేమతో ఆస్తులు అమ్మి అప్పుల భారాన్ని మోస్తున్నారు.

నమోదు కాని కేసులు

అప్పుల బాధతో యువత ఆత్మహత్యలు.. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతుండటంతో తల్లిదండ్రులు, వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాయి. పరువు పోతుందనే భయంతో ఈ విషయాలను బయటకు చెప్పేందుకు వెనకాడుతున్నారు. దీంతో ఇలాంటి కొన్ని ఆత్మహత్యలపై కేసులు నమోదు కావడం లేదు.





'దుబ్బుల' కళాకారులను సాంస్కృతిక శాఖలో చేర్చాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెల్లెల బాలక్రిష్ణ

పాపన్నపేట, మే 18: దుబ్బుల కొలుపు కళాకారులను తెలంగాణ సాంస్కృతిక శాఖలో చేర్చడంతోపాటు ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెల్లెల బాలక్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా ఏడుపాయలలో దుబ్బుల కొలుపు కళాకారులతో కలసి మహా కొలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. వందలాది కళాకారులు వాయిద్య పరికరాలైన, డప్పులు, కొమ్ములు చేతబూని దుర్గమ్మ, పోతరాజులు వేషధారణతో మహాకొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కొలుపు వృత్తి కళను తెలంగాణ సాంస్కృతిక శాఖలో భాగంగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షల ఉచిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కళాకారులందరికి నెలకు రూ.5 వేల పించను, సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. దేవాలయాల్లో గ్రామీణ కళాకారులకు గ్రామీణ పూజారులుగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు రాష్ట్ర యూనియన్ కోశాధికారి బోగిరి ఆనంద్, జనగారి లక్ష్మణ్, సంపత్, గిరుగుల సమ్మయ్య, రవీందర్, నామిని, రాజ్‌కుమార్, వాండేన్, జనగరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.




ఏడుపాయల వన దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన మహా కొలుపులో తమ కళను ప్రదర్శిస్తున్న దుబ్బుల కళాకారులు















21న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

● క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే 18: సంగారెడ్డి జూబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఈ నెల 21న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు మెదక్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో క్రీడాకారులు హాజరుకావాలని సూచించారు. ఎంపికల్లో పాల్గొనే వారు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న అండర్-25 టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రికెట్‌లో ఉన్నతంగా ఎదగాలనుకునే క్రీడాకారులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మెదక్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి సూచించారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శంకర్ (ఫైల్)

శివ్వంపేట, మే 18: రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని బొజ్యాతండా పంచాయతీ పరిధిలోని హరిదాస్‌తండాకు చెందిన బానోత్ శంకర్(35), అదే తండాకు చెందిన మూడవత్ రాంచందర్ ఇద్దరు కలిసి గురువారం రాత్రి గంగాయిపల్లి ఊడుగుల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బానోత్ శంకర్ నీట మునిగాడు. గమనించిన రామచందర్ అక్కడి నుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం స్థానికులకు చెరువు దగ్గర శంకర్ దుస్తులు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించినా మృతదేహం లభించలేదు. శనివారం ఉదయం శంకర్ మృతదేహం చెరువులో తేలడంతో బయటకు తీశారు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

● బస్సు ఎక్కుతుండగా లాక్కెళ్లిన దుండగులు

జహీరాబాద్, మే 18: మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం జరిగింది. జహీరాబాద్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం చీలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ గ్రామం నుంచి సంగారెడ్డికి వెళ్లేందుకు జహీరాబాద్ బస్టాండ్‌కు వెళ్లింది. సంగారెడ్డికి వెళ్లే బస్సులో ఎక్కుతున్న క్రమంలో రద్దీగా ఉండడంతో తోపులాట జరుగుతుండగా గుర్తు తెలియని వక్తులు అదును చూసి ఆమె మెడలో ఉన్న 8తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. గొలుసు విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని వారు తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జహీరాబాద్ పోలీసులు వివరించారు.

జీపీ కార్యదర్శిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు

వెల్దుర్తి, మే 18: విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా తోమెటి రాజేశం పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఉన్న రాజేశం వద్దకు అదే గ్రామానికి చెందిన కావేటి శేఖర్ వెళ్లి.. తన స్థలంలో డ్రైనేజీ కట్టిస్తావా, నీ సంగతి చూస్తానంటూ పంచాయతీ కార్యదర్శి చొక్కాను పట్టుకుని దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా కార్యాలయ ఆవరణలో ఉన్న కర్రతో కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. శేఖర్‌తో ప్రాణభయం ఉన్నదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


● మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద



నర్సాపూర్ కోర్టు ఆవరణలో మొక్కను నాటుతున్న మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద, న్యాయవాదులు

నర్సాపూర్, మే 18: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే తమ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. శనివారం నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో స్థానిక న్యాయాధికారి కె.అనితతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చెట్లను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. చెట్లతో పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన గాలి, ఫలాలు ఇచ్చి ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ఇష్టానుసారంగా చెట్లను నరకవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పీపీ రాఘవేందర్, ఏజీపీ సత్యనారాయణ, సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్, న్యాయవాది స్వరూపరాణి పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో ప్రజిన్‌కు 159వ ర్యాంకు



ఉప్పల ప్రజిన్

చేర్యాల, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన ఉప్పల ప్రజిన్ రాష్ట్ర స్థాయిలో 159వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీలో ఇంటర్ పూర్తిచేసిన ప్రజిన్ ఎప్‌సెట్ అర్హత పరీక్షలో 121.49మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ప్రజిన్ మెయిన్స్‌లో ఆలిండియా 709ర్యాంకు సాధించాడు. ప్రజిన్‌ను స్థానికులు అభినందించారు.

తండ్రి మరణంతో అనాథైన బాలుడు

● ఆర్థిక సాయం అందజేసిన గ్రామస్థులు

కుకునూరుపల్లి, మే 18: రాయవరం గ్రామానికి చెందిన రామిండ్ల స్వామి(16) తన ఐదవ ఏటనే అనారోగ్యంతో తల్లిని కోల్పోగా, గురువారం తండ్రి కూడా అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ బాలుడు అనాథయ్యాడు. ప్రస్తుతం స్వామి ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో గ్రామ పంచాయతీ నిర్మించిన వాటర్ ప్లాంట్‌లో నివాసం ఉంటున్నారు. దీంతో గ్రామంలోని యువకులు చొరవ తీసుకొని గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి శనివారం రూ.32వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షల నిర్వహణ

● సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం
● టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్ల వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

సంగారెడ్డి రూరల్, మే 18: జూన్ 9న నిర్వహించే గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని రకాలుగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్ రాజ్, మను చౌదరి తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా కలెక్టరేట్‌ల నుంచి వేర్వేరుగా కలెక్టర్లు హాజరై, మాట్లాడారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలను పకడ్బందీగా సజావుగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మేరకు ఫర్నిచర్, టాయిలెట్స్, తాగునీరు విద్యుత్ సరఫరా వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఒక రోజు ముందుగానే వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధ్రువీకరించుకోవాలని కలెక్టర్లు సూచించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు నేపథ్యంలో 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతినిస్తారని, అభ్యర్థులు రెండు గంటల ముందు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. పది గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పరీక్షా నిర్వహణకు సంబంధించి ప్రశ్నాపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో నిర్వహిస్తామని కలెక్టర్లు తెలిపారు. ప్రతి అంశం సీసీ కెమెరాలు రికార్డు అయ్యేలా చూస్తామన్నారు. జిల్లా అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు పరీక్ష నిర్వహణకు అవసరమైన మేరకు సిబ్బందిని నియమించనున్నట్లు కలెక్టర్లు వివరించారు. అభ్యర్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడిసేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతామని చెప్పారు.

సంగారెడ్డి జిల్లాలో 9,672 మంది అభ్యర్థులు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ... జిల్లాలో 9,672 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారికోసం 37 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి బయోమెట్రిక్ యంత్రాలు ఒక రోజు ముందుగానే జిల్లాకు వస్తే వాటిని పరిశీలించి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ క్రాంతి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఏవో పరమేశం, పరీక్షల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 4వేల మంది అభ్యర్థులు

మెదక్ అర్బన్: గ్రూప్-1 పరీక్ష నిర్వహణ కోసం మెదక్ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 4 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రతీ కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 8,239 మంది అభ్యర్థులు

సిద్దిపేట అగ్రికల్చర్: సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... జిల్లాలో 21 సెంటర్లలో 8,239 మంది అభ్యర్థులకు గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా పరీక్షలను నిర్వహిస్తామని కలెక్టర్ మనుచౌదరి వివరించారు. ఈ సమావేశంలో పోలీస్ నోడల్ అధికారి అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, ఇందూరు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి

● సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, మే 18: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24నుంచి జూన్ 3వరకు పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఫస్టియర్‌లో 9,318 మంది, ఒకేషనల్ 599 మంది, సెకండియర్‌లో 4,646 మంది, ఒకేషనల్ 323 మంది, మొత్తం 14,886 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు పొందాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

● ఎక్కువ కేసులను పరిష్కరించండి: న్యాయాధికారి భవానీచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, మే 18: జూన్ 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర కోరారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో బ్యాంకు, పోలీసు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ అధికారులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికిల్ నష్ట పరిహార కేసులు, బ్యాంకు కేసులు, రాజీ మార్గాన పరిష్కారానికి అనువైన కేసులన్నీ పరిష్కరించాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులు గుర్తించి తమ కేసులన్నీ పరిష్కరించుకోవాలని జి.భవానీచంద్ర కోరారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.జయంతి, రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి డా.పి.కృష్ణార్జున్, మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి జి.సునీతారవీంద్రారెడ్డి, నాల్గవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.లావణయ్య, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మణ్‌చారి, ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి పి.తేజశ్రీ, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి సూరిక్రిష్ణ

జహీరాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బ్యాంకు అధికారులతో లోక్ అదాలత్‌పై సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.సూరిక్రిష్ణ సమావేశం నిర్వహించారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సౌజన్యంతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో జూన్ 8న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని చెప్పారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు సోమశేఖర్, జగన్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి

సిద్దిపేట క్రైం: సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి మాట్లాడారు. జూన్ 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అత్యధిక కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీ పడేందుకు కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేయాలన్నారు.

ఉద్యాన పంటలతో అధిక దిగుబడులు

● పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీలో బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి

ములుగు, మే 18: ఉద్యానవన పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు రావడమే కాకుండా అధిక ఆదాయం వస్తుందని రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీలో డాక్టర్ విసి.నీరజప్రభాకర్ అధ్యక్షతన విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం విశ్వవిద్యాలయం చేపట్టిన పరిశోధన విస్తరణ ఫలితాలను విశ్లేషించుకుంటూ ఉద్యాన అధికారులు, విస్తరణ అధికారులు, ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రాబోయే సంవత్సరానికి చేపట్టవలసిన పరిశోధనను నిర్ణయిస్తారని, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలు, వంగడాలు నాటాలని ఆయన సూచించారు. ఉద్యాన పంటలను సాగు చేయడం వలన రైతులకు సంప్రదాయ పంటల కంటే రెండు రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ బి.నీరజప్రభాకర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న వివిధ పరిశోధనా స్థానాల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వివిధ పంటల్లో వచ్చే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను ఉద్యాన శాఖ, విస్తరణ విభాగం ద్వారా రైతులకు ఉద్యాన పంచాంగం, బ్రోచర్ పాంప్లెట్స్, రేడియో, టీవీ కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు అవగాహన కల్పించారు. కేవీకే వారు తయారుచేసిన కరివేపాకు పొడి, మునగాకు పొడి, గోరింటాకు పొడిలను ఉద్యాన కమిషనర్ పరిశీలించారు. ఇటువంటి ఉత్పత్తులను స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేసేందుకు వారికి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలని కోరారు. రైతులు ఉద్యానశాఖ అధికారులను వివిధ పంటల సాగుపై అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. జనగామ నుంచి వచ్చిన రైతు వై.వెంకన్న మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు సబ్సిడీ మీద కూరగాయల విత్తనాలు, డ్రిప్ పరికరాలు, శాశ్వత పందిరి ఇచ్చి ఉద్యాన పంటల సాగును పెంచడానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. 9మందికి గాయాలు



ఆరూర్ గ్రామం వద్ద బోల్తా పడిన బస్సు

సదాశివపేట, మే 18: ట్రావెల్ బస్సు బోల్తాపడి తొమ్మిది మంది గాయపడిన సంఘటన శనివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ముఖతి(35) తన కుటుంబ సభ్యులు 10మందితో కలిసి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం, తిరుపతి దేవస్థానాలను దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11గంటల సమయంలో సదాశివపేట మండలం ఆరూర్ గ్రామం వద్ద డ్రైవర్ అజాగ్రత్తతో జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహేంద్ర ముఖతి భార్య ప్రేరణ(27), కూతురు సురవిక, బంధువులు సరేష్, మరో ఐదుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన కారు

● ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి స్వల్ప గాయాలు



నౌసిన్‌కి ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

కుకునూరుపల్లి, మే 18: మూలమలుపు వద్ద డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు బోల్తాపడిన సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. సంగారెడ్డికి చెందిన ఓ కుటుంబ సభ్యులు సిద్దిపేట నుంచి సంగారెడ్డికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారు ముందు భాగంలో కూర్చున్న నౌసిన్ తలకు, ఛాతిలో బలమైన గాయాలవ్వడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కారులో ఉన్న మన్సూర్ కుడి చేయి విరగగా, మసూద్‌అలీకి స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న మూడు సంవత్సరాల పాపకి ఎలాంటి గాయాలు కాకపోవడం విశేషం. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మారెపల్లి లక్ష్మీనారాయణుడి కల్యాణ మహోత్సవం



మారెపల్లిలో లక్ష్మీనారాయణస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, వేడుకకు హాజరైన భక్తులు

కొండాపూర్, మే 18: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారెపల్లి లక్ష్మీనారాయణ ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వైకుంఠపురం ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్చరణలు, బాజాబజంత్రీలతో భక్తుల మధ్య కల్యాణం జరిపించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ యజ్ఞం, యాగాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు భరతనాట్య ప్రదర్శన చేశారు. కోలాటాలు, నృత్యాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు, భజన, సంకీర్తనలు వంటి కార్యక్రమాలతో ఆలయం సందడిగా మారింది. వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తిరు కల్యాణం



దొంతిలో వేణుగోపాలస్వామి తిరు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

శివ్వంపేట: మండలంలోని దొంతి గ్రామంలో దేవాదాయ శాఖ పరిధిలోని ప్రఖ్యాతి గాంచిన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఏటా వైశాఖమాసంలో 11 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, స్నేహలతరెడ్డి, సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి గోపాలకృష్ణశర్మ సమక్షంలో వేణుగోపాలస్వామి తిరు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి విగ్రహాన్ని గ్రామంలోని వీధుల్లో ఊరేగించి, ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు.

కూరగాయల వ్యాపారుల ఆందోళన



రామాయంపేటలో ధర్నా చేస్తున్న కూరగాయల వ్యాపారులు

రామాయంపేట, మే 18: వసతులతో కూడిన మార్కెట్‌ను నిర్మించాలంటూ రామాయంపేటలో కూరగాయల వ్యాపారులు శనివారం ధర్నాకు దిగారు. అమ్మకాలు ఆపేసి ఆందోళన బాట పట్టారు. తాము మున్సిపల్ వారికి నిత్యం తైబజార్ కడుతున్నా తమ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇక్కడ రైతు బజార్ నిర్మించినా ఎలాంటి వసతులు కల్పించక అమ్మకాలు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొన్నాళ్లుగా సీఎస్ఐ చర్చి ఆవరణలో తాత్కాలికంగా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఇక్కడి నుంచి దుకాణాలు ఎత్తివేయాలని చర్చి నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

భూముల విలువ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళనకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపార సంఘం సభ్యులు

సిద్దిపేట టౌన్, మే 18: భూముల విలువను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపార సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజలింగం డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో రియల్ ఎస్టేట్ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే నత్తనడకలా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం భూముల విలువ పెంచడంతో పూర్తిగా డీలా పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ వాల్యూ ఉంటుందని, భూమి విలువ పెరగడం ద్వారా రిజిస్ట్రేషన్ వాల్యూ పెరుగుతుందన్నారు. దీని వల్ల భూముల అమ్మకాలు, కొనుగోలు పూర్తిగా నిలిచిపోయి తమ జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆలోచించి 7.5 శాతం ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలను మూడు శాతానికి తగ్గించి భూముల విలువలను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులమంతా కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రంగయ్య, కార్యదర్శి దరిపల్లి శ్రీనివాస్, చిన్నా, సభ్యులు నర్సింలు, బాలయ్య, ముగిలి శ్రీనివాస్, చింతల యాదగిరి, అడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● నాగపురిలో ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణాశిబిరం
● ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు
● నిత్యం 50మంది హాజరు

చేర్యాల, మే 18: వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందింపజేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కల్పించే దిశగా సిద్దిపేట జిల్లా యువజన క్రీడలశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 24నుంచి ఈ నెల 8వరకు ఉచిత రెసిడెన్షియల్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విద్యార్థులు ఆకర్షితులవడంతో శిక్షణను కొనసాగిస్తున్నారు. ఈ నెల 31వరకు సాధారణ శిబిరం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడంతో గ్రామానికి చెందిన విద్యార్థులతో పాటు సమీప గ్రామాల విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ పీఈటీ రఫత్ ఉమర్, నాగపురి జడ్పీఎస్ఎస్ పీఈటీ జి.విశాల నిత్యం ఉదయం వేళల్లో 50మంది విద్యార్థులకు హ్యాండ్‌బాల్ క్రీడాశిక్షణనిస్తూ మెళకువలు నేర్పిస్తున్నారు.



హ్యాండ్‌బాల్ ఉచిత శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులు

మెళకువలు నేర్చుకున్నాను : బాలు, నాగపురి



నేను నాగపురి జడ్పీఎస్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాను. హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో నాకు ఆసక్తి కలిగి, మెళకువలు నేర్చుకున్నాను. వేసవి సెలవులను వృథా చేయలేదన్న సంతృప్తి ఉంది.

జాతీయస్థాయికి ఎంపికవుతాను: జ్యోత్స్న, నాగపురి



హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో నాకూ ప్రేరణ కలిగించింది. పీఈటీలు సూచించిన మెళకువలను పాటించాను. మరింత ప్రావీణ్యం పొంది జాతీయస్థాయికి ఎంపికవుతానన్న నమ్మకం కలిగింది.

మానసికోల్లాసానికి దోహదం : పీఈటీ జి.విశాల



గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు, యువతలో మానసికోల్లాసం కలిగించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు శిక్షణా శిబిరాలు దోహదం చేస్తాయి. శిక్షణా శిబిరానికి 50మంది విద్యార్థులు హాజరవుతున్నారు. మెళకువలు నేర్పుతూ తీర్చిదిద్దుతున్నాం.



హ్యాండ్‌బాల్ సర్వీసింగ్‌పై శిక్షణ ఇస్తున్న పీఈటీ రఫత్



హ్యాండ్‌బాల్‌తో సర్వీసింగ్ చేస్తున్న విద్యార్థిని

ఘనంగా వాసవీమాత జయంతి


సంగారెడ్డి శివారులోని వాసవీమాత ఆలయంలో మామిడిపండ్ల అలంకరణ


నారాయణఖేడ్: వాసవీమాత జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


తూప్రాన్‌లో వాసవీమాత శోభాయాత్రలో భక్తులు


మెదక్అర్బన్: వాసవీమాత ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలను పువ్వులు, పండ్లతో అలంకరించారు. ఆలయాల్లో మహిళలు లలితాసహస్ర నామ పారాయణం, కుంకుమార్చనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. పలుచోట్ల వాసవీమాత శోభాయాత్రలు కనులపండువగా సాగాయి.

సంగారెడ్డి రూరల్, మే 18 : వాసవీమాత జయంతిని వాసవి మహాసంస్థాన్ అధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఐబీ వద్ద ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ అతిథి గృహం నుంచి ప్రధాన రహదారి మీదుగా వాసవి మాత ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఆలయంలో అమ్మవారిని మామిడి పండ్లతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితాసహస్ర పారాయణం, అమ్మవారికి పల్లకీసేవ తదితర కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, విద్యాసాగర్, ప్రకాష్, నామభాస్కర్, మహేందర్, యువజన సంఘం అధ్యక్షుడు తోపాజి హరీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** నారాయణఖేడ్‌పట్టణంలో వాసవి మాత జయంతి వేడుకలను శనివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ, సామూహిక కుంకుమార్చన, డోలాహరణం, వాసవీమాత వ్రతాలు, లలితా సహస్ర పారాయణం, తదితర కార్యక్రమాలను పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఓడి బియ్యం సమర్పించారు.

● **రామచంద్రాపురం:** మండలం జీహెచ్ఎంసీ 111 డివిజన్ బొంబాయి కాలనీలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్లు సింధుఆదర్శ్‌రెడ్డి, పుష్పానగేష్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, పరమేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం, డోలారోహణం, మహా హారతి, శోభాయాత్ర, నృత్యప్రదర్శనలు, దాండియా కార్యక్రమాలు చేపట్టారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్, మే 18: ఆర్యవైశ్యుల కుల దేవత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని శనివారం పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం శ్రీ కోదండ రామాలయం నుంచి మహిళలు కలశాలతో వాసవీమాత ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి అభిషేకం. గాజుల పూజలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా తయారు చేసిన రథంలో అమ్మవారిని ఊరేగించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీకేఆర్ గార్డెన్ నుంచి ప్రారంభమైన రథోత్సవం జేఎన్‌రోడ్డు మీదుగా కుమ్మరిగడ్డ వాసవి మాత ఆలయం వరకు చేరుకున్నది. మహిళల కోలాటం, దాండియా, భజన పాటలతో ఊరేగింపు కొనసాగింది. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పట్టణ అధ్యక్షుడు శ్యాంరావు, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు కొత్త లక్ష్మీపతి, డాక్టర్లు చంద్రశేఖర్, సురేష్, శివమణి, మహేష్, చంద్రయ్య నిర్వహణ కమిటీ చైర్మన్ నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** పట్టణంలో శ్రీవాసవి కన్యాకపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఐవీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఉదయం శివాలయం నుంచి ఆర్యవైశ్య సంఘం భవనం వరకు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలశపూజ, శ్రీవాసవీ మాతకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు.

● **పెద్దశంకరంపేట:** వాసవీమాత జయంతి సందర్భంగా పెద్దశంకరంపేటలో శనివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేదబ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి పీఠం ఎదుట సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

మంజీరాలో మహిళ మృతదేహం లభ్యం


కోరె సుజాత (ఫైల్)

కొల్చారం, మే 18: మండలంలోని పోతంశెట్పల్లి శివారులోని ఏడుపాయల దారిలో మంజీరానది మొదటి బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు మెదక్‌లోని నవాబ్‌పేటకు చెందిన కోరే సుజాత(41)గా గుర్తించినట్లు కొల్చారం ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సమస్యలతో సుజాత, తల్లి రాజమ్మ ఈ నెల 16న గొడవ పడ్డారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన సుజాత తిరిగి రాలేదు. దీంతో ఈ నెల 17న ఆమె భర్త కోరే రాజయ్య మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శనివారం పోతంశెట్‌పల్లి శివారులోని మంజీరానదిలో మహిళ శవం లభ్యమైందన్న సమాచారం మేరకు పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులను రప్పించి విచారించగా సుజాత శవంగా గుర్తించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


బుస్స సత్తయ్య (ఫైల్)

హవేళీఘణపూర్, మే 18: మండలంలోని స్కూల్ తండా శివారులో ఆగిఉన్న బస్సును బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన బుస్స సత్తయ్య(50)ను మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్తయ్య శనివారం మృతిచెందాడు. మృతుడు మండలంలోని శమ్నాపూర్‌కు చెందినవాడు. మెదక్ నుంచి స్వగ్రామానికి బైక్ పై వెళ్తున్న క్రమంలో రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. మృతుడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య ముత్తవ్వ, కొడుకు, ఉన్నారు. అంత్యక్రియలకు కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, తిరుపతిరెడ్డిలు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు.

గాయత్రి ఆస్పత్రిలో రేపు ఉచిత వైద్య శిబిరం

సంగారెడ్డి అర్బన్, మే 18: సంగారెడ్డి విద్యానగర్‌లోని గాయత్రి పిల్లల ఆస్పత్రిలో ఈ నెల 20న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.చక్రపాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరంలో ఎఫ్‌బీఎస్, పీఎల్‌బీఎస్, సీరం క్రియాటినైన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలను అవసరమైన మేరకు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మధుమేహం, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు, థైరాయిడ్, కీళ్లవాతం, మెదడు, నరాల సంబంధిత వ్యాధులను పరీక్షించి చికిత్స చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో ఎం.డీ.జనరల్ మెడిసిన్ డాక్టర్ మోతీలాల్, డాక్టర్ ఎం.రమాదేవి పాల్గొననున్నట్టు తెలిపారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

జిన్నారం, మే 18: జిన్నారం ఎస్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని, రీజినల్ కార్యాలయం రాజేంద్రనగర్‌లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 23న సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు

రాయికోడ్, మే 18: మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వర జాతర ఉత్సవాలు ముగియడంతో 26 రోజుల హుండీ కానుకలను శనివారం ఆలయ సిబ్బంది, అధికారులు లెక్కించారు. బంగారు, వెండి వస్తువులతో పాటు రూ.1.54లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఆలయ ఈవోమోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులుఉన్నారు.

'ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశాం'

రామాయంపేట, మే 18: ధర్మారంలో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేశామని, జిల్లా పౌరసరఫరాల అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవటంతో ఆలస్యం జరిగినా, ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఆపబోమన్నారు. ఈ విషయంపై రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

రైస్ మిల్లులను సందర్శించిన అధికారులు


తూప్రాన్: యావాపూర్ రైస్‌మిల్లును సందర్శించిన జడ్పీ సీఈవో, ఆర్డీవో తదితరులు


కొల్చారంలోని రైస్‌మిల్లులో మాట్లాడుతున్న నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

తూప్రాన్, మే 18: మండలంలోని రైసు మిల్లులను శనివారం జడ్పీ సీఈవో సీహెచ్ ఎల్లయ్య తూప్రాన్ ఆర్డీవో ఎం. జయచంద్రారెడ్డి సందర్శించారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లోని నవదుర్గా బిన్నీ రైస్‌మిల్, యావాపూర్‌లోని వీరభద్ర రైస్ మిల్, ఘనపూర్‌లో సాయినాథ్ రైస్‌మిల్లులను సందర్శించి రైసుమిల్ యజమానులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌పై ఏర్పడుతున్న సమస్యలపై చర్చించారు. సీఎంఆర్ బియ్యం సేకరణ వివరాలు, మిల్లుల రికార్డులు, ధాన్యం నిలువ సామర్థ్యం, ధాన్యం సేకరణలో అన్‌లోడింగ్ ఇబ్బందులపై చర్చించి తగిన సూచనలు చేశారు. ధాన్యం సేకరణ తక్షణమే చేపట్టాలని, ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. అధికారుల వెంట తూప్రాన్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో కృష్ణవేణి, సీనియర్ సహాయకులు పాంపాటి లక్ష్మణ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, రైసు మిల్లు యజమానులు మన్నె హన్మంతరావు ఉన్నారు.

లారీలను త్వరగా అన్‌లోడ్ చేయాలి: ఆర్డీవో

కొల్చారం, మే 18: లారీలను త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి రైస్‌మిల్లర్లకు సూచించారు. కొల్చారంలోని శ్రీసత్యసాయి పారాబాయిల్డు రైస్‌మిల్లును శనివారం ఆయన సందర్శించారు. అకాల వర్షాలతో వరిధాన్యం బస్తాలు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వచ్చిన లారీలను త్వరగా అన్‌లోడ్ చేసి మళ్లీ లారీలను రైతులకు పంపించాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మహ్మద్‌గఫార్ మియా ఉన్నారు.

రైస్ మిల్లులను తనిఖీ చేసిన డీఆర్డీఏ పీడీ

నర్సాపూర్, మే 18: మండలంలోని పలు రైస్ మిల్లులను డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని శివసాయి, వెంకటేశ్వర, సాయికృష్ణ, తిరుమల సాయి వెంకటేశ్వర రైస్‌మిల్లులను పీడీ తనిఖీ చేసి ఆయా మిల్లుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సామర్థ్యానికి తగినట్టుగా ధాన్యం లారీలను త్వరగా ఖాళీ చేయాలని సూచించారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లిలోని కొనుగోలు కేంద్రం పరిశీలించి అక్కడ ధాన్యం నిలువతో పాటు కొనుగోలు ప్రక్రియను, ట్యాబ్ ఎంట్రీని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరిశంకర్, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.


గిరిజన సంప్రదాయ దుస్తులతో నల్ల పోచమ్మకు బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

ఘనంగా నల్ల పోచమ్మకు బోనాలు

శివ్వంపేట, మే 18: మండల పరిధిలోని బిక్యాతండా పంచాయతీ పరిధిలోని నానుతండాలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న నల్ల పోచమ్మ జాతరలో భాగంగా మొదటిరోజు శనివారం బీక్యా, సీత్యా, నాను, తండాకు చెందిన గిరిజనులు నల్ల పోచమ్మకు గిరిజన సాంప్రదాయ దుస్తులతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో మూడు గిరిజన తండాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం జాతర నిర్వహించడం జరుగుతుందని గిరిజనులు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, దారు హరి సింగ్, బీఖ్యా, విఠల్, చిన్న రామచందర్, ఉన్నారు.

అటవీ ప్రాంతాల పరిశీలన

నారాయణఖేడ్, మే 18: అడవుల పరిస్థితిపై జిల్లా అటవీ శాఖ అధికారి(డీఎఫ్‌వో) శ్రీధర్‌రావు శనివారం ఆరా తీశారు. నారాయణఖేడ్ రేంజ్ పరిధిలోని కడ్పల్, వెంకటాపూర్, బోరంచ, సిర్గాపూర్, నాగ్‌దర్, తడ్కల్, కంగ్టి తదితర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అటవీ ప్రాంతాల్లో చిరుతపులి, అడవి జంతువుల సంచారం గూర్చి తీరా తీశారు. రానున్న వర్షాకాలంలో అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటనున్న దృష్ట్యా నర్సరీల్లో కొనసాగుతున్న మొక్కలపెంపకాన్ని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు విత్తన శుద్ధిని ఆయన పరిశీలించారు. అటవీ శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

● **జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి**

సంగారెడ్డి అర్బన్, మే 18 : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 1, 5వ తరగతికి సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చేరేందుకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సంబంధిత పత్రాలతో జూన్ 7వ తేదీ వరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆదర్శ పాఠశాల పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలి

● **జిల్లా విద్యాధికారి రాధాకిషన్**

నర్సాపూర్, మే 18: అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన పనులన్నీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ హైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించి సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాధాకిషన్ హాజరయ్యారు. సమావేశంలో ఎంఎంవో సుదర్శన్, ఎంఈవో బుచ్యానాయక్, ఎస్‌వో నవీన్, మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కొబ్బరికాయలు, పులిహోర వేలం పాట

హత్నూర, మే 18: హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో గల పలుగు మీది పోచమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం కొబ్బరికాయలు, పులిహోరకు వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయల వేలం పాటలో శేర్ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన నడిమింటి ప్రవీణ్‌గౌడ్ రూ.9.25లక్షలకు దక్కించుకున్నాడు. లడ్డు పులిహోరను అదే గ్రామానికి సుంకరి ప్రభాకర్ రూ.4.15లక్షలకు దక్కించుకున్నాడు.

టీఎస్ ఎప్‌సెట్‌లో మెరిసిన శ్రీఅక్షయ విద్యార్థులు


వంశీకృష్ణ, పూజిత, వివేక్, నిమ్మిజేమ్స్, లేనా మరియాథామస్, హరిణి

సంగారెడ్డి అర్బన్, మే 18: కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా సమీపంలో శ్రీ అక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎప్‌సెట్-2024 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో(ఎంపీసీ) కె.వంశీకృష్ణ 2086 ర్యాంకు, అగ్రికల్చర్ విభాగంలో(బీపీసీ)సి.పూజిత 2383 ర్యాంకు సాధించి రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లాస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వీరితో పాటు ఇంజనీరింగ్ విభాగంలో(ఎంపీసీ) జీ.వివేక్ రాష్ట్ర స్థాయిలో 4230 ర్యాంకు, నిమ్మిజేమ్స్ 9568 ర్యాంకు, లేనా మరియాథామస్ 10540 ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో(బీపీసీ)సీహెచ్.హరిణి రాష్ట్రస్థాయి 5905 ర్యాంకు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారిని కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు భానుచందర్‌రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్‌జోషి, అధ్యాపక బృందం అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోని యంత్రాంగం



● **సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా**

సంగారెడ్డి రూరల్, మే 18: ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అయినా రైతులకు ఆదుకునేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాలతో మామిడి కాయలు రాలిపోగా, ఇతర పంటలు నేలకొరిగాయన్నారు. కలెక్టర్ గానీ లేదా ఇతర అధికారులెవరూ క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో వర్షసూచన వస్తే చాలు కరెంటు పోతున్నదని చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

పరిపాలన గాలికి వదిలేసిన కాంగ్రెస్: పద్మారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మే 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ఘోరంగా విఫలమైందని.. ప్రజాపాలనను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా మహాలక్ష్మి పథకాన్ని మంటలో కలిపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు అని చెప్పి మెదక్ నియోజకవర్గంలో 9 రూట్లలో బస్సులు రద్దుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ దవాఖానాల్లో వసతులు కరువయ్యాయని, కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయని విమర్శించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పనితనానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు వడ్లరాశులు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయన్నారు. సమావేశంలో జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు భీమరి కిషోర్, జయరాజ్, అంజాగౌడ్, శ్రీనివాస్, సలాం, ప్రభురెడ్డి, కిషన్‌గౌడ్, బట్టి ఉదయ్, ఇస్మయిల్, బద్రి, నరేందర్ తదితరులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్‌గా ఆదిత్యరెడ్డి

పటాన్‌చెరు, మే 18: రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్‌గా పటాన్‌చెరుకు చెందిన పట్లోళ్ల ఆదిత్యరెడ్డి నియమితులయ్యారు. గతంలో సంగారెడ్డికి రెండు మార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన స్వర్గీయ పి.నర్సింహారెడ్డి మనుమడు పట్లోళ్ల ఆదిత్యరెడ్డి హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్యుడిగా పనిచేస్తున్నారు. కాగా ఆయన గత కొంతకాలంగా యువజన కాంగ్రెస్‌లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన్‌రెడ్డి పట్లోళ్ల ఆదిత్యరెడ్డిని యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ ఎండీ.అతిక్, కాంగ్రెస్ నాయకులు ధీరజ్‌రెడ్డి, శ్రవన్‌రెడ్డి, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలు సమైక్యతకు చిహ్నాలు

జహీరాబాద్, మే 18: జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ చర్చిలో నిర్వహించే క్రైస్తవ ఉజ్జీవసభల జాతర ఉత్సవాలు సమైక్యతకు చిహ్నంగా మారాయని రాష్ట్ర ఫిలీం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో ప్రారంభమైన క్రైస్తవ ఉజ్జీవసభల జాతర ఉత్సవాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పట్టణంలో నడిబొడ్డున ఇంత పెద్దఎత్తున జాతరను నిర్వహించడంపై ఉత్సవ కమిటీ సభ్యుల పనితీరును అభినందించారు. గత రెండురోజులుగా దేవుడికి ప్రత్యేక ప్రార్థనలు, క్రీడా పోటీలు, ఆరాధన, నిర్వహించారు.

సాగు విధానంపై రైతులకు అవగాహన తప్పనిసరి


శేఖాపూర్‌తండాలో మహిళా రైతులతో మాట్లాడుతున్న కృషివిజ్ఞాన శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్, మే 18: రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా, సాగులో కొత్త పద్ధతులపై అవగాహనను పెంపొందించుకోవాలని డెక్కన్ డెవలప్‌మెంట్ - కృషివిజ్ఞాన కేంద్రం (డీడీఎస్-కేవీకే) శాస్త్రవేత్తలు రమేష్, స్వామి, కైలాష్ తదితరులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని శేఖాపూర్ తాండలో మహిళారైతులకు వ్యవసాయసాగువిధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయభూముల్లో ఏటా విధిగా భూసారపరీక్షలు చేయించుకోవాలన్నారు. దీంతో భూముల్లో భూసారం కోల్పోతే చేపట్టే చర్యలపై అవగాహన వస్తుందన్నారు. దీంతో పాటు విత్తనాలు విత్తడం మొదలుకుని, పంటలు చేతికొచ్చేవరకు అధికారుల సలహాలు సూచనలనుపాటిస్తే ఆశించిన తరహాలో దిగుబడులు వస్తాయన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ, పంచగవ్య, ఘనద్రవ జీవామృతం, దశపర్ణీకషాయం, బ్రహ్మాస్త్రం తదితరాల తయారీపై అవగాహన కల్పించారు. రైతులు సేంద్రీయ ఎరువులనే వాడాలని వారు సూచించారు. దీంతో పాటు వర్షకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు, జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పించారు. రైతులకు ఏమైన సందేహాలుంటే శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, డీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

నిజాంపేట, మే 18: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి గోవిందమ్మ కల్యాణోత్సవం శనివారం మండల కేంద్రంలో విశ్వకర్మ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో దంపతులుగా మాజీ సర్పంచ్ వడ్ల తిరుమలయ్య కళావతి, కమ్మరి సూర్యచంద్రం మంజుల దంపతులతో నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** బొల్లారంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరంలో ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. శనివారం బొల్లారం బీసీ కాలనీలో వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు.

పోతన్‌పల్లిలో..

నారాయణఖేడ్, మే 18: మండలపరిధిలోని పోతన్‌పల్లి. ఆర్ లో శనివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన మహోత్సవాలను వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ధ్యాన ఆశ్రమ నిర్వాహకుడు వడ్ల విఠలాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, ధ్యాన శిక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

జీలుగ విత్తనాల కోసం బారులు



నర్సాపూర్‌లో విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

నర్సాపూర్, మే 18: ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు జీలుగ విత్తనాల కోసం పెద్ద ఎత్తున దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. భూమి సారవంతం కోసం జీలుగు విత్తనాలు చల్లడానికి అనువైన సమయంగా భావిస్తూ రైతులు జీలుగ విత్తనాల కొనుగోలు కోసం నర్సాపూర్ వ్యవసాయ కార్యాలయానికి వచ్చి టోకెన్ తీసుకుని దుకాణం వద్దకు వెళ్లారు. అయితే రైతులకు సరిపడా జీలుగు విత్తనాలు అందుబాటులో లేక బారులు తీరారు. చాలామందికి విత్తనాలు లభించక నిరాశతో వెనుదిరిగారు.

● **కొల్చారం:** కొల్చారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కొల్చారం మండల వ్యవసాయాధికారి శ్వేతకుమారి తెలిపారు. శనివారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగ విత్తనాలు 30 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ.1,674లకు, పెద్ద జనుము విత్తనాలు 40 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ. 2,172లకు లభిస్తుందని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అందజేసి విత్తనాలు సబ్సిడీపై తీసుకోవాలని తెలిపారు.

● **మాసాయిపేట:** మండలంలోని ఆగ్రో కేంద్రంలో జీలుగు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ తెలిపారు మాసాయిపేటలోని రైతు సేవా కేంద్రంలో జీలుగు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని రైతులను వాటిని వినియోగించుకోవచ్చని ఒక బస్తా ధర 1100 రూపాయలు 30 కేజీలకు అందుబాటులో ఉన్నాయని మిగతా పచ్చి రొట్ట జనుము తదితర విత్తనాలు త్వరలో సరఫరా చేస్తామని ఏవో రాజశేఖర్ గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.

ఎదుల్లాపూర్‌లో రైతుల నిరసన

శివ్వంపేట, మే 18: అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో సబ్సిడీ జీలుగు, పెద్ద జనుము విత్తనాలు అందుబాటులో లేక ప్రైవేట్‌గా అధిక డబ్బులను వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఎదుల్లాపూర్ లో విత్తన సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకొని విత్తనాల సమస్యలు పరిష్కరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన రైతు పైనం నర్సింహులు, మాట్లాడుతూ జిలుగు జనుము విత్తనాలు ఇతర మండలాల్లో రైతులకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఓవైపు వర్షాలు కురుస్తున్నా మండలంలో విత్తనాలు అందుబాటులో లేక ఇతర గ్రామాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో రైతులు యాదిరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కుమార్, హనుమంత్, తదితరులు ఉన్నారు.


విత్తన సమస్య పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు